# ఎడారి కోయిల

నాకు ఉద్యోగం వచ్చిందని తెల్సినప్పుడు కొద్దిగా బాధ పడినమాట మాత్రం వాస్తవం. అలాగని ఉద్యోగం నాకవసరం లేదని కాదు. మేమున్న పరిస్థితుల్లో ఉద్యోగం రావటం నిజంగా అదృష్టమే. నాన్నగారు పోయినప్పటినుండీ వస్తున్న కొద్దిపాటి పెన్షన్ డబ్బుల్తో ఎలాగోలా జీవితాన్ని నెట్టుకొస్తున్న మాకు - ఉద్యోగం దేవుడిచ్చిన వరమే. ఎటొచ్చీ హైద్రాబాద్ బ్రాంచికి పోస్ట్ చేయటమే. . . .

పుస్తకాల్లో హైద్రాబాద్ మన రాష్ట్ర రాజధాని అని చదువుకోవటం తప్ప ఎప్పుడూ చూడలేదు. చూడాలని కూడా అనుకోలేదు. హైద్రాబాద్ అనగానే చార్మినార్, గోల్కొండ కోట మాత్రమే కాదు - సముద్రంలా కదిలే జనప్రవాహం - కలుషితమైన వాతావరణం - కర్ఫ్యూలు - కత్తిపోట్లు కూడా గుర్తుకు వస్తాయి.

పేపర్లలో చదివి పెంచుకున్న అయిష్టత కాదిది. స్వతహాగానే చరిత్ర అంటే గిట్టదు నాకు. మా వూరికి ఏ విధమైన చరిత్రా లేదు. ఓ వందలోగిళ్ళున్న వూరు మాది. పక్కా రోడ్లు కానీ, సరియైన బస్ సౌకర్యం కానీ, అవసరమైనప్పుడు వైద్య సదుపాయం కానీ దొరకని గ్రామం.

ఈ వూళ్ళోనే అక్కా, నేనూ పుట్టాం. ఈ వూళ్ళోనే మా బాల్యం గడిచింది. మా అమ్మ మమకారంతో పాటు ప్రకృతి ఒడిలోని మాధుర్యాన్ని చవి చూసింది కూడా ఇక్కడే. . .

మా వూరికి రెండు ఫర్లాంగుల దూరంలో సముద్రం ఉంది. . . అక్క వాసంతీ,

నేను తీరిక దొరికనప్పుడల్లా వెళ్ళి సముద్రపు ఒడ్డున ఆడుకునే వాళ్ళం. మా చిన్నప్పుడు తడి ఇసుకలో పడి దొర్లితే ఎంత బావుండేదో..... ఒంటి నిండా ఇసుకని పులుపుకుని, తర్వాత సముద్రంలో ఈత కొట్టేవాళ్ళం. వాసంతి నాకంటే రెండేళ్ళు పెద్దది. ఆడపిల్లైనా చాలా ధైర్యస్థురాలు. మగపిల్లల కంటే ముందు తను సముద్రం లోకి ఉరికేది. మేం వద్దన్నా వినకుండా లోపలికి ఈదుకుంటూ వెళ్ళి, పెద్ద కెరటం వస్తున్నడు దానిపైకి ఎగబ్రాకి దాంతో పాటు ఒడ్డుకు జారేది.

"ఒరేయ్ తమ్ముడూ - నీవూ రారా - ఎంత బావుందో" అని వూరించేది. అయినా అక్కకున్నంత ధైర్యం, తెగింపు నాకు లేనందువల్ల నేనంత లోపలికి వెళ్ళే వాడిని కాదు.

వెన్నెల రాత్రుళ్ళు సముద్రపు ఒడ్డున కూచుని కబుర్లు చెప్పుకుంటుంటే ఎంత హాయిగా ఉంటుందో. . . . .సముద్రంలో ఈత కొట్టడం కన్నా, ఒడ్డున కూచుని, సముద్రపు ఘోష వింటూ - మెల్లగా జాలువారే వెన్నెలని ఆస్వాదిస్తూ కూచోవటమే నా కిష్టం. వెండి జలతారు లాంటి వెన్నెల పడి మెరిసే సముద్రపు నురగని చూడటం - సరుగుడు చెట్ల మధ్యలోంచి గాలి కదిలేప్పుడు చేసే శబ్దం - అవనిని అందుకోవాలని ఎగసి పడే ఉత్తుంగ తరంగం ఓడి - తీరం ఒడిలోకి వాలి పోవటం. . . . ఎంతటి మహత్తర దృశ్యం! ఏ జన్మలోనో పుణ్యం చేసు కుంటేనే ఇటువంటి దృశ్యాల్ని అవలోకించే అదృష్టం కలుగుతుంది.

"నీవు ఈత కొట్టు - నేను ఒడ్డున కూచుని సముద్రపు సోయగాల్ని చూస్తాను" అన్నప్పుడల్లా నీలో నాన్నగారిలా కవివయ్యే లక్షణాలున్నాయిరా అనేది - తనేదో అంతర్జాతీయ స్విమ్మర్ అయినట్లు. . . .

నాన్నగారు చక్కటి కవిత్వం వ్రాసే వారు. దాన్ని రాగయుక్తంగా చదువుతుంటే వినటం మాకెంత సరదానో. . . కొన్నిసార్లు నాన్నగారు మాకు తోడుగా వచ్చేవారు - సముద్రపు ఒడ్డున కూచోడానికి. ఓ దుప్పటి పరిచి నేనూ, అక్కా, నాన్నగారు కూచునేవారం. చల్లటి వెన్నెల - చక్కటి గాలి - నాన్నగారి కవిత్వం . . . మాకు

సమయం తెలిసేదికాదు.

నాన్నగారు శ్రావ్యంగా పాడేవారు. వారి కంఠంలోని మాధుర్యం మాకు వారసత్వంగా రాకపోవటం మా దురదృష్టం. విశ్వనాథ వారి కిన్నెరసాని పాటల్ని, నండూరి వారి ఎంకి పాటల్ని వారు పాడగా వినటం నా మహాద్భాగ్యం.

"బొట్టు బొట్టు కొక వేయి యెదలుగా
తరగ తరగ కొక వేయి నోళ్ళుగా
ఒడలి నీరమే యేడుపు మయమై" అని పాడుతుంటే మాకూ దుఃఖం ఆగేది కాదు.

"యెలతురంతా మేసి, యేరు నెమరేసింది

కలవరపు నా బతుకు, కలతనిదరయ్యింది" అని పాడితే, మరలా మరలా పాడించుకుని వినాలనిపించేది.

నాన్నగారు పోయి నాలుగేళ్ళయినా - ఈ సముద్రపు హోరులో . . . . ఇక్కడి చిరుగాలి సవ్వడిలో . . . . .చివరికి చిగురుటాకు కదలికలో కూడా నాకు నాన్నగారి కవిత్వం - వారి తీయనైన కంఠస్వరం విన్పిస్తాయి.

మా వూరికి మరో ప్రక్క చెరువుంది. పశువుల్ని ఆచెరువు లోనే కడిగేవారు. పిల్లలందరికీ ఆ చెరువులో ఈతకొట్టడం చాలా ఇష్టంగా ఉండేది. మాతోపాటు చిన్న చిన్న చేపలు గజిబిజిగా కదుల్తుంటే చూడటం ఓ అనుభూతి నాకు. అక్క హఠాత్తుగా వూపిరి బిగపట్టి అడుక్కి వెళ్ళిపోయేది. అప్పుడు ఆమె జుట్టువూడి నల్లటి మహావృక్షంలా శాఖోపశాఖలుగా విచ్చుకుంటే నాకు భయమేసేది.

"ఇలా చేశావని నాన్నగారికి చెప్తానుండు" అని బెదిరించే వాడిని.

"ఒరేయ్ తమ్ముడూ. . . నీకు చింతకాయలూ, జామకాయలూ కావాలా వద్దా" అని ఆశ చూపి నోరు మూయించేది.

మా వూరిని అర్థచంద్రాకారంలో చుట్టూ సాగే వాగుంది - చంద్రభాగ . . . దాని కిరువైపులా చింత, వేప, నారింజ చెట్లు, జామ, మామిడి చెట్టు . . . .ఇలా రకరకాల చెట్లున్నాయి. ఆ వాగు ఎక్కడినుండో వచ్చి సముద్రంలో కలిసేది. వర్షాకాలంలో అయితే వాగునిండా నీళ్ళు పరవళ్ళు తొక్కుకుంటూ ప్రవహిస్తుంటాయి.

చింత చెట్లని ఎక్కాలంటే నేను వెనకాడే వాడిని - వాటినిండా చీమలుంటాయి. కానీ అక్క అవన్నీ లెక్క చేసేది కాదు. లంగాని గోచీలా దోపుకుని చెట్టు ఎక్కేది. నేను మాత్రం గురి చూసి రాళ్ళు విసిరే వాడిని. రాయి తగిలి చింతకాయ రాలినపుడు కలిగే ఆనందం చెట్టెక్కి కోస్తే వచ్చేది కాదు.

కాగితప్పడవలు చేసి వాగులోకి వదిలి వాటి వెంటే పరుగెత్తే వాళ్ళం. అవి కొంత దూరం వెళ్ళి - తడిసి - మునిగి పోయేవి. వాగులో కొద్దిగా నీళ్ళున్నప్పుడు, వాగు సముద్రంలో కలిసే చోట నన్ను నిల్చోబెట్టి వాసంతి ఓ వందగజాలు ఎగువకు వెళ్ళి కాగితపు పడవలు వదిలేది. వాటిలో నాకో రహస్యం వ్రాసి పంపిస్తానని చెప్పేది. నేను ఆశగా వాటిని అందుకుని విప్పదీసి చూస్తే "నీవు బడుద్ధాయివి. నీవు వెర్రి వెంగళాయివి" లాంటి వాక్యాలు వ్రాసి నన్నేడిపించేది.

నేను మాత్రం "మా అక్క బంగారు తల్లి - నా అక్క చాలా మంచిది" లాంటి వాక్యాలు రాస్తే, తిరిగి వచ్చాక, చెదరిపోయిన నా జుట్టుని నిమురుతూ "నీవు ఎంత మంచి వాడివిరా తమ్ముడూ" అని అక్క మురిసిపోయేది.

ఇన్ని తీయటి జ్ఞాపకాలతో ముడిపడిన ఈ వూరినీ, ఇక్కడి సముద్రాన్నీ, వెన్నెలనీ, వాగునీ వదిలి వెళ్ళటం . . . . . అందునా హైద్రాబాద్‌కి . . . .

పెద్దగా నవ్వింది వాసంతి.

"హైద్రాబాద్‌లో ఆకాశం లేదా ఆ ఆకాశంలో చంద్రుడూ, నక్షత్రాలూ ఉండవా. . . . అదేమిట్రా తమ్ముడూ - వెన్నెల మన వూరికే పరిమిత మైనట్లు. . . ."

నేను మాట్లాడలేదు. అక్కకు తెలుసు - నేనెందుకు బాధపడ్తున్నానో. . . . నన్ను తను అర్థం చేసుకున్నంత బాగా ఎవరూ అర్థం చేసుకోలేరేమో.

నాకు ఉద్యోగం వచ్చిందన్న వార్త తెలిసి రెక్కలు కట్టుకుని వాలిపోయింది. అమ్మ పడుకున్నాక నేనూ, వాసంతి ఇంటి ముందున్న తోటలో కుర్చీ వేసుకుని కూచున్నాం. ఈ తోట మేం పెంచిందే. ఇందులోని గులాబీ, జాజి, చామంతి, బంతి. . . . . ఇవన్నీ నేనూ, అక్కా పసిపిల్లల్ని పెంచినట్లు శ్రద్ధగా పెంచుకున్న మొక్కలే. చిన్న చిన్న పిట్టలు, సీతాకోక చిలుకలు మా పూలతోటలో ఎగుర్తుంటే మాకెంత సంబరంగా ఉండేదో . . . .

దూరం నించి సముద్రపు ఘోష విన్పిస్తోంది. పైనించి వెన్నెల ఒయ్యారంగా జారుతోంది.

"తమ్ముడూ - సముద్రం మనల్ని పిలుస్తున్నట్టు లేదూ!" అంది వాసంతి.

"వెన్నెల తన వేనవేల కిరణాలతో మనల్ని చుట్టేసి తన వైపుకు లాక్కుంటున్నట్లుంది కదూ"అంది మరలా. . . .

నా భావుకతని ఆట పట్టిస్తుందో లేక నన్ను మంచి మూడ్‌లోకి తేవటానికి ప్రయత్నిస్తుందో అర్థంగాక సీరియస్‌గా మొహం పెట్టాను.

అక్క మరలా నవ్వింది. "నీవు ఇలా మథన పడ్తావని తెలిసే వచ్చాను. మనం ప్రాక్టికల్‌గా ఆలోచించటమే మంచిది. హైద్రాబాద్ అయితేనేం. . . . అక్కడ ఎన్నో మంచి మంచి పార్కులున్నాయట - హుస్సేన్‌సాగర్ ఉందిట. అయినా మన ఊళ్ళోనేఉండి పోవాలంటే ఎలా కుదుర్తుంది? గవర్నమెంటు ఉద్యోగం అన్నాక వాళ్ళు ఎక్కడవేస్తే అక్కడికి వెళ్ళాల్సిందే. అర్థంలేని చాదస్తాలతో అంత మంచి ఉద్యోగాన్ని వదులు కోవటం విజ్ఞత అన్పించుకోదు. అయినా అందం ఎక్కడ లేదూ! ఆస్వాదించటం తెలియాలే కానీ. . . ."

అక్క ఎంతగా నచ్చచెప్పినా - బరువైన గుండెతోనే హైద్రాబాద్ బయలుదేరాను.

మా వూళ్ళోని మా ఇంటి కెదురుగా పెంచుకున్న పూల తోటంత ఉన్న స్థలంలో పదహారు వాటాల ఇల్లు ఎలా కట్టాడో ఆశ్చర్యపోతూనే, అందులో ఓ చిన్న గదిలో అద్దెకు దిగాను.

మొదట్లో మా వూరు బాగా జ్ఞాపకం వచ్చేది. అమ్మకూ, అక్కకూ రోజూ ఉత్తరాలు రాసేవాడిని.

ఆఫీస్‌లో పని వత్తిడి పెరిగింది. ఉదయం లేచినప్పటి నుండీ పరుగే. కొద్దిగా ఆలస్యమైనా బస్ వెళ్ళిపోతుంది. ఆఫీస్‌లో బాస్‌తో చివాట్లు - నా సీటు నిండా ఫైళ్ళే- ముందూ, వెనుకా, పక్కనా . . . . బీరువాల్లో అస్తవ్యస్తంగా కుక్కిన ఫైళ్ళు . . . వాటినిండా దుమ్మూ, ధూళీ. . . . ఆ ఫైళ్ళలో నేనూ ఓ ఫైలులా కల్సిపోయి. . . సాయంత్రం బస్‌లో ముష్టియుద్ధం చేసి రూం కెళ్ళేటప్పటికీ, ఎక్కడ లేని నిస్సత్తువ ఆవహించేది. భోంచేసి పడుకుంటే స్పృహ తెలిసేది కాదు. ఉదయం లేచేప్పటికే సూర్యోదయమై గంట గంటన్నర కాలం గడిచిపోయి ఉండేది.

మా వూరిలోని సూర్యోదయం చూడాలంటే పెట్టి పుట్టాల్సిందే. . . . సూర్యుడు సముద్ర గర్భంలోంచి కొద్ది కొద్దిగా పైకి వస్తుంటే ఆకాశంలో నాట్యం చేసే నారింజ, ఎరుపు, పసుపు రంగుల సమ్మేళనం - ఉషోదయానికి మేలుకొలుపులా, హోరెత్తే కడలి కెరటాలూ. . . . కెంపులు పొదిగిన కిరీటాన్ని ధరించి తీరానికి తరలి వచ్చే నురగకన్నియలు. . . .

అక్కడి సాయంత్రాలు ఏ రకంగానూ తక్కువ మనోహరమైనవికావు. కమ్ముకొచ్చే చీకట్లు కూడా ప్రత్యేకంగానే ఉంటాయి. అక్కడి ఇసుక రేణువులు నిండిన ధూళి. . . .సముద్రం మీంచి వీచే గాలిలో తేలి వచ్చే అదోరకమైన వాసన. . . . నిష్కపటంగా, నిర్మలంగా నవ్వే మనుషులూ. . . . . ప్రకృతితో తాదాత్మ్యం చెందాలంటే మా వూరు వెళ్ళాల్సిందే. . . .

కానీ పనివత్తిడి. . . . పరుగు . . . . ప్రతిదానికీ హడావిడి . . . . పోటీ. . . .

అందుకోక పోతే ఎప్పటికీ అందదేమోననే భయం. పక్కవాడు లాక్కుంటాడనే భీతి. . మనుషుల్లో కృత్రిమత్వం . . . మాటల్లో కపటం. . . .మోసం. . . . దగా. . . . పక్కవాడిని తొక్కేసి గాని పైకి రాలేని దారుణ పరిస్థితి . . . . ఈ ప్రవాహంలో కొట్టుకుపోయి కొన్నేళ్ళు గడిచిపోయాయి.

నాకు పెళ్ళైంది. అమ్మాయిది హైద్రాబాదే. ఇంతకు ముందుండే గది కంటే కొద్దిగా పెద్దది అద్దెకు తీసుకున్నాం. ఓ చిన్న వంటిల్లు - బెడ్రూం అనబడే మరో గది. దాని కానుకుని బాత్రూం. . . అంతే. నా భార్యతో వెన్నెట్లో తడుస్తూ కబుర్లు చెప్పుకోవాలని ఎంతటి కోరికో ! తనకు మాత్రం ఇవేవి పట్టేవి కావు. తీరిక ఉంటే సినిమా కెళ్దాం అంటుంది. లేకపోతే ఇంట్లో స్టార్ టివి ఎదురుగా గంటలతరబడి కూచుంటుంది.

మృదువుగా - ఆత్మీయంగా - ఆదరంగా స్పృశించే వెన్నెల. . . . పలకరించి పులకరించే వెన్నెల - పరువంతో తుళ్ళిపడే పడుచుపిల్ల లాంటి వెన్నెల. . . నేను చకోర పక్షిలా అయిపోయాను. ఒక్కోసారి దిగులేసేది. అక్క ఉండే వూరికి దగ్గిరగా పోస్ట్ చేసినా బావుండేది. ఆ చిన్న వూరిలో తనింటిని చాలా కళాత్మకంగా తీర్చి దిద్దింది అక్క. ఇంటి ఎదురుగా సన్నజాజి పందిరి ఉంది. నేనెప్పుడు వెళ్ళినా పడక సన్నజాజి పందిరి కిందే. నా పక్కన కూచుని బోల్డన్ని కబుర్లు చెప్పే అక్కతో "ఇలా రాత్రంతా మాట్లాడుకుంటుంటే ఎంత బావుంటుంది" అంటే తన పెద్ద కళ్ళని చక్రాల్లా తిప్పి "హమ్మో! మీ బావగారు ఏమై పోతారు" అని తుర్రుమని ఇంట్లోకి పారిపోయేది. బావకు నాలుగెకరాల జీడిమామిడి తోట ఉంది. ఆ తోటలో జీడి మామిడి చెట్టెక్కి కూచోవటం నాకెంతిష్టమో. . . .

"చేతి కందేంత ఎత్తున్న ఈ చెట్టెక్కటం కూడా బడాయేనా - దమ్ముంటే చింతచెట్టు ఎక్కిచూడు" అని అక్క అల్లరి చేసేది.

ప్చ్ ! ఏమనుకుని ఏం ప్రయోజనం! కీకారణ్యం లాంటి హైద్రాబాద్‌లో చిక్కుబడి పోయాక . . . . నా భార్యకివేమీ పట్టేవి కావు. ఆమెకు హైద్రాబాద్ అంటే చాలా ఇష్టం. ఇక్కడి సుందర హర్మ్యాలు . . . . పెద్ద పెద్ద ఆఫీసులు - డబుల్ డెక్కర్‌లు -

స్టార్ హోటళ్ళు - స్టార్ హాస్పిటళ్ళూ. . . . వేగం. . . . పరుగూ . . . . అన్నీ తన కిష్టమే. . . .

మాకో బాబు పుట్టాడు. వాడికపుడే ఆరేళ్ళు వచ్చేశాయి. నాకు ప్రమోషన్ వచ్చింది. అంటే బాధ్యతలు పెరిగాయన్మాట. వూపిరి సలపనంత పని.

హైద్రాబాద్ మీద వెన్నెల కాయదు అనే నా నమ్మకానికిపుడు ఎనిమిదేళ్ళు. నన్ను సిటీ కొండ చిలువ మింగేసింది. ఆకాశం కన్పించదు. అంతా అంధకారమే . .

ఓ రోజు నా శ్రీమతి జీటీవి చూస్తున్నప్పుడు మా బాబు తెలుగు వాచకం చదువుతూ . . . "మమ్మీ వెన్నెలంటే ఏమిటి?" అని అడిగాడు.

"మీ నాన్నగారి నడుగు పో" అని కసురుకుంది - టీవీలో లీనమైన నా భార్య.

వాడు బిక్కమొహంతో నా దగ్గరకొచ్చి అడిగాడు. "నాన్నగారూ! వెన్నెలంటే అర్థం చెప్పరా" అని.

నాకు చాలా దుఃఖం వచ్చింది. వాడికెలా చెప్పను? వెన్నెలంటే నా ప్రాణమని. . . . వెన్నెల అమ్మ స్పర్శలా ఉంటుందని, వెన్నెల ఆత్మీయంగా అల్లుకుంటుందని - ప్రేమతో పాదాల్ని చుట్టుకుంటుందని - వెన్నెలకు అర్థం చెప్పాల్సి రావటం ఎంతటి దౌర్భాగ్యం! మా వూరి కెళ్ళి ఓ నెలైనా గడపాలని అపుడే నిర్ణయించుకున్నాను.

ఆ మరునటిరోజే ఇన్స్పెక్షన్ ఉండటం వల్ల ఆ విషయం మరలా మరిచిపోయాను. పని భూతం నన్ను మింగేసింది. ఆ చీకటి కుహరంలో దారీ తెన్నూ తెలీక. . . . కొన్ని నెలలు గడిచిపోయాయి.

ఓ రోజు ఆఫీసు పనిమీద వికారాబాద్ వెళ్ళాల్సి వచ్చింది. హైదరాబాద్కు డెబ్బయ్ కిలోమీటర్ల దూరంలో ఉన్న వూరది. ఆ రోజు మా బ్రాంచ్ ఆఫీసులో పనిపూర్తి కానందు వల్ల రాత్రికి అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మా స్టాఫ్లో నటరాజన్ తన ఇంటికి పిల్చుకెళ్ళాడు.

ఇల్లు చిన్నదైనా పొందిగ్గా ఉంది. అరిటాకులో భోజనం పెట్టారు. . . . తమిళ వంటకాలు . . . . చాలా రుచిగా ఉన్నాయి. తృప్తిగా భోంచేశాను.

డ్రాయింగ్ రూంలో పడక ఏర్పాటు చేశారు. నేను డాబామీద పడుకుంటానని చెప్పాను.

"వద్దుసార్! ఎండాకాలం అయితే బావుంటుంది" అని నటరాజన్ ఎంత చెప్పినా, నేను విన్పించుకోలేదు.

దుప్పటీ, దిండూ తీసుకుని డాబా మీదకెళ్ళాను. పడుకుని ఆకాశం కేసి చూశాను. ఎక్కడా మేఘాలు లేవు . . . . నిండు పున్నమి - వెన్నెల పుచ్చ పూవులా విరగ కాస్తోంది. వెన్నెల విరహిణిలా నా శరీరాన్ని తాకి - తడిమి - కౌగిలించుకుంటున్నట్లుంది. నేను పోగొట్టుకున్న పెన్నిధి దొరికినంత సంబరం నాకు . . . . కొన్ని యుగాలుగా ఎదురు చూసి, విసిగి, వేసారి, చివరికి ప్రేయసిని పొందినంత తమకం. . . . తిరునాళ్ళలో తప్పిపోయిన కొడుకు, ఒడిలోకి పాక్కుంటూ వచ్చినంత ఆనందం!

వెన్నెల నన్ను ముంచేస్తోంది. ఆకాశంలోంచి కుండల్తో కుమ్మరించినట్లు కురుస్తోన్న వెన్నెల నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అక్క చెరువులో మునిగి అడుక్కి వెళ్ళిపోయినట్లు, నేనూ ఈ వెన్నెట్లో మునిగిపోతున్నాను. వెన్నెల తన వేల చేతుల్తో నన్ను బలంగా తన వైపుకు లాక్కుంటోంది. అమ్మ ఒడిలో పడుకున్నంత హాయిగా ! నాన్నగారి కవిత్వం వింటున్నంత కమ్మగా! వారి పాటలా మధురంగా!

మరునాడు హైద్రాబాద్ చేరుకున్న వెంటనే ఆఫీస్‌కెళ్ళి సెలవు చీటీ పడేశాను. తన అమృత హస్తాల్తో పిలుస్తోన్న నా వూరు ఒడి చేరటానికి.

● *మందాకిని మాసపత్రిక, ఫిబ్రవరి, 1996* ●